# అదృష్టమెవరిది?

"చిత్రలేఖకు మళ్లీ పెళ్లి చూపులటా?"

అదో విచిత్ర మన్పించింది కృష్ణారావుకు. క్షణకాలం నివ్వెరబోయాడు గూడా.

"ఔనూ! పారే నదికి ఒడ్డూ పొంగే వయసుకు జంటా ఉండి తీరాలి గదా! పెళ్లీడు కొచ్చిన ఆడకూతురుకు పెళ్లి కుదిరే దాకా పెళ్లి చూపులవాల్సిందే గదా! ఇంత మాత్రానికే ఆశ్చర్యపోవాలా?"

కృష్ణారావులోని కృష్ణారావు లెంపలు వాయించాడు. రోజట్లా మురళి పాటలు ప్రాక్టీసు చెయ్యాలనిపించడం లేదు. పక్కన ఉంచేశాడు దాన్నలా.

అంతకు ముందు సంగతి తెలీదుగానీ - అతడు వాళ్లింటి అద్దె గదిలో దిగినప్పటి నుండీ.... అంటే.... రెండు సంవత్సరాల్లో చిత్రలేఖ కనీసం పాతికసార్లైనా పెళ్లి చూపులకు తయారైంది.

చిత్రలేఖ తియ్యగా పలుకరిస్తుంది. కమ్మగా మాట్లాడుతుంది. మల్లెపూవులా నవ్వుతుంది. పెళ్లి చూపులప్పుడు మొగ్గలా ముడుచుక్కూచుంటుంది. అల్లికలూ, కుట్టుపనులూ... అవన్నీ ఆవిడకు కరతలామలకం.

కాని... పెళ్లి చూపుల కొచ్చిన వారికివన్నీ ఏం తెలుసూ? కేవలం బాహ్య సౌందర్యం... రంగూ, రూపులే ప్రామాణికాలు. వాటినే చూపుల బాణాలతో కొలిచి - తేల్చి పారేస్తారు.

నిజమే... చిత్రలేఖ నల్లగానే ఉంటుంది. ముందుపళ్లమీది వరుస కాస్త ఎత్తుగానే ఉంటుంది. ఎంత బాగా పాడినా-కాకి లాంటి కోకిల రంగూ, రూపులు మారనట్టే - ఆవిడ ఎంత బాగా అలంకరించుకున్నా అవి దాగవు గదా! అసలూ... పెళ్లి కూతుళ్ల అంతరంగాన్ని చదవగలిగిన పెళ్లికొడుకెవ్వడూ! ఐనా... అంతరంగ మెవడిక్కావాలీరోజుల్లో? అమ్మాయి ఎర్రగా, బుర్రగా ఉండాలి. ఆపై కొద్దో గొప్పో కట్నం మోసుకు రావాలి. మామూలు అందమైతే... కట్నం రేటు పెంచేస్తే పేచీలేదు. కాని చిత్రలేఖ విషయం వేరు. సగటు పెళ్లికూతురు కుండాల్సిన అందచందాలు పైవాడామెకు ప్రసాదించలేదు. కనీసం డబ్బురాసుల మీదనన్నా పుట్టించలేదు. పైవాడిది అసమ దృష్టి

అనేందుకింతకంటే మంచి ఉదాహరణ ఇంకేం కావాలి?

"అబ్బా, ఈ చింతమొద్దు అవతారం ఎవడిక్కావాలి?"

"రంగు పక్కా... వెలిసిపోతే వాపస్!"

" ఆ సుందరాంగికి ఎత్తు పళ్లు గూడానా!"

"కట్నం గూడా ఇచ్చుకోరాయె... పెళ్లెట్లాగవుతుందీ?"

వచ్చినవారు పలురకాల కామెంట్సు మొహం మీద పడేసి వెల్తుంటే ఆవిడ మనసెంత గిజగిజలాడిందో కృష్ణారావు బాగా అర్థం చేసుకోగలడు. ఎవర్నైనా ప్రేమించి పెళ్లిచేసుకునే ధైర్యం, చొరవా ఆమెకు లేవనీ తెలుసు. అందుకే.... ఆమెకు పెళ్లి చూపులన్నప్పుడల్లా అతని ముందో హత్య జరగబోతున్నట్టు తల్లడిల్లిపోతాడు.

పెళ్లి చూపులనగానే చేయి తిరిగిన మేకప్‌మెన్‌లా గబగబా తయారౌతుంది. చేతనైనన్ని వయ్యారాలు ఒలకబోస్తూ వచ్చిన వారెదుట కూర్చుంటుంది. గాలి వాన చినుకుల్లా వస్తున్న ప్రశ్నలకు వంచిన తలెత్తకుండా సమాధానాలిస్తుంది. అంతా అయాక ప్రశ్నలడిగిన వారి వేళ్లు ముక్కుల కతుక్కు పోతాయి. ఆడవాళ్ల మూతులైతే అరవై వంకర్లు తిరిగిపోతాయి. చెప్పా పెట్ట కుండా లేచి వెళ్లిపోతారు- నిర్ణయం వెల్లడిస్తూ. అప్పుడా అమాయకురాలి గుండెల్లో ఎన్ని బాంబులు పేల్తాయో - బాగా తెలుసు.

ఎందుకంటే..

మూడేళ్ల క్రితం, తానీ ఊరు బదిలీపై రాక ముందు కాలికి బలపం కట్టుకుని ఎన్నో పెళ్లి సంబంధాలుచూచాడు. చూచిన ఆడపిల్లలందరూ అతనికి నచ్చారు, కాని ఒక్కమ్మాయి గూడా తనతో జీవితాన్ని పంచుకునేందుకు ముందుకు రాలేదు. కట్నం ఇవ్వగలిగిన వారిదీ, ఇవ్వలేని వారిదీ... అందరిదీ ఒక్కటే ధోరిణి.

"అమ్మాయికి అబ్బాయి నచ్చలేదు."

"మరీ నల్లసరపు బండలా గున్నాడేమిటీ!"

"పగలు చూస్తే రాత్రి కలలోకి రావడం ఖాయం"

"లావాటి పెదాలూ, గొంగళి పురుగులతికించుకున్నట్టు మోటైన కనుబొమ్మలూ... మరీ అంత అనాకారనుకోలేదు."

"అబ్బాయి ఎడమకాలు పోలియోతో వంకరైందని ముందు తెలీదు."

"అష్టావక్రుని చంపి ఈయన పుట్టుంటాడు."

"కన్యాశుల్క మిచ్చినా సరే... ఏ పిల్లా చేసుకోదు."

మాటల ఈటెలు కృష్ణారావు గుండెల నిండా తూట్లు పొడిచాయి. బెండకాయలా ముదిరినా సరే... ఇహ తనకీ జన్మలో పెళ్లికాదని తేలిపోయింది. ఆ విషయాలు గుర్తుకొస్తే అతని గుండె చెరువైపోతుంది.

ఈ ఊరొచ్చింతర్వాత నిష్ణాతుడైన ఓ గురువు దొరికాడు. తన కత్యంత ప్రియమైన మురళి వాయించడం నేర్పేందుకొప్పుకున్నాడు. అది తన అదృష్టంగా భావించి వెంటనే శిష్యరికం స్వీకరించాడు.

కృష్ణారావు దివారాత్రాలు శ్రమించి ప్రాక్టీసు చేస్తుంటే గురువు గారి ఆదరాభిమానాలు మెండుగా లభించాయి. రెండు సంవత్సరాల్లో ఎన్నో మెలకువలు నేర్చాడు. మధుర, మనోహర మురళీనాదం మండే గుండెలకు వెన్నపూస రాసింది. మానసికంగా మలుపులు తిప్పి మరో లోకంలో విహరింపజేసింది. తనగాన మాధుర్యం చల్లని పున్నమి వెన్నెల కురిపించింది.

వంశీ వాద్యకారుడుగా, మంచి కళాకారుడిగా పేరొచ్చింది. ఎన్నో పట్టణాల్లో ప్రోగ్రాములిచ్చి శ్రోతల ప్రశంసాతుషార బిందువుల్లో తడుస్తూ ఆత్మానందం పొందాడు.

శివరంజని రాగం వాయిస్తుంటే తలలాడించిన పెద్దలూ, ఆనందభైరవిలో పాటలు వినిపిస్తుంటే ఆనంద డోలికలూగిన కోటీశ్వరులూ కాళ్లు కడిగి కన్యాదానం చేసేందుకు ముందు కొస్తున్నారు. మోహనరాగం వినిపిస్తూంటే మోహ పారవశ్యంలో మునిగితేలిన కన్నె పిల్లలు తనను ప్రేమిస్తున్నామని ఉత్తరాలు రాస్తున్నారు. మునుపటిలా తననెవ్వరూ "అప్టరాల్ అటెండర్" అనడం లేదు. ఆఫీసులో తనతో కాఫీలూ, సిగరెట్లూ తెప్పించుకోవడం మానేశారు గుమస్తాలు. అందరూ గౌరవం ఇచ్చి పుచ్చుకుంటున్నారు.

"నువ్వే మురళీగాన కళా నిధివేయ్!" అన్నాడు ఆఫీసర్.

ఎగువ, దిగువ గుమాస్తాలు ఇంతటి కళాకారుడితో కలిసి పంజెయ్యడం అదృష్టమనుకుంటున్నారు.

కేంద్ర సంగీత-నాటక ఎకాడమీ సన్మానం అందింతర్వాత

"స్వయంకృషితో ఎంతటోడివి ఎంతవాడివయావురా కుంటీ!" అంటూ ప్రేమగా తలనిమిరాడు- రిటైర్మెంట్ అంచున నిల్చున్న ఆఫీసు సూపర్నెంటు. దఫేదారైతే గట్టిగా కౌగలించుకున్నాడు.

మనో వీధిలో వసంతం వెల్లి విరిసింది. ఆ వసంతంలో అందగత్తె లెందరో కోయిలలై కూయాలని ఉవ్విళ్లూరుతున్నారు.

"చిత్రలేఖకు మళ్లీ పెళ్లి చూపులైపోయినై.

తల్లి వెక్కి వెక్కి ఏడుస్తూంది. తండ్రి దభీమని మంచంలో పడిపోయాడు. మొదటికి నరికిన చెట్టులా. పలుకరిస్తే జల జల మనే కన్నీళ్లతో చిత్రలేఖ చాపమీదే కూచుంది.

"దీనికిహ పెళ్లి కాదు. నా గుండెల మీది కుంపటి దిగిపోదు...." బోరుమన్నాడు తండ్రి. అనుకోకుండా కృష్ణారావు కళ్లు చెమ్మగిల్లాయి. చేతి గుడ్డతో కళ్లద్దుకుంటూ వెళ్లాడటు. చిత్రలేఖ తండ్రికి ధైర్యం నూరిపోయాలని ప్రయత్నిస్తూంటే.....

"వద్దు బాబూ! ఆయన్నలా ఏడ్వనివ్వు. ఎందుకంటే మాకిహ మిగిలింది ఏడుపే. మా అతుకుల బతుకుల కిదో గుదిబండలా తయారైంది. మాకు చేతనైనంత చదివించాం. వంటపనీ, ఇంటి పనీ అన్నీ నేర్పాం. అనాకారిగా పుట్టించి ఆ దేవుడు దానికి తీరని అన్యాయం చేశాడు." తల్లి హృదయం కరిగి కళ్ల ద్వారా బయటి కొస్తుంది.

అనాకారి.., అ.నా.కా.రి. అ.. నా...కా...రి... ఆ మాట కృష్ణారావు చెవుల్లో గింగురు మంటూంది. గుండెల్ని కలిచేస్తుంది. నెత్తి మీద పిడుగుల వర్షం కురిపిస్తూంది. పాల పొంగులా ముంచుకొచ్చిన కోపం గొంతులో ఆగిపోయింది.

"కన్నవారు, మీరు గూడా అలాగనడం ఏమీ బాగలేదు. చిత్రలేఖ ఎంత బాధపడ్తుందో ఊహించారా?" అన్నాడు. ఆపుకుందామన్నా ఆగని అశృధార చెంపల్ని తడిపేస్తుంది.

అనూహ్యమైన అతని వాలకానికి వృద్ధ దంపతులు చకితులై పోయారు.

"ఔను బాబూ" తండ్రి అందుకుని, "కాకిపిల్ల కాకికి ముద్దన్నట్టు- అమ్మాయి మాకు అనాకారిగా కాక అందగత్తెగానే కనబడుతూంది కాని ఇతరుల కలా కన్పించదు గదా! చూస్తూ చూస్తూ దీన్నేవరు పెళ్లాడ్తారయ్యా!" మొహమాటం లేకుండా ప్రశ్నించాడు.

"అంతెందుకూ, నువ్వు పెళ్లాడ్తావా బాబూ?" సూటిగా ప్రశ్నించింది తల్లి.

చిత్రలేఖ ఉలిక్కిపడింది.

ఐదు నిమిషాల అయోమయం.

"ఔను చిత్రలేఖ ఒప్పుకుంటే తప్పకుండా పెళ్లాడుతాను అన్నాడు కృష్ణారావు. ఆ మాటల్లో ఎదురులేని నిర్ణయం.

మూడు జతల కళ్లు అతణ్ని మార్చి మార్చి చూస్తున్నాయి.

"మీరు జోక్ చేస్తున్నారు గదూ!" అశానిరాశల మధ్య చిత్రలేఖ కంఠం చిత్రంగా ధ్వనించింది.

"దైవసాక్షిగా చెబుతున్నా. ఇది జోక్ కాదు.. చిత్రలేఖ కళ్లలోకి సూటిగా చూశాడు.

అందరి కళ్లల్లో ఆనంద భాష్పాలు.

ఎరుపెక్కిన చిత్రలేఖ బుగ్గల మీది సిగ్గుల్ని చిలిపి చూపులతో ఏరుకుంటున్నాడు కృష్ణారావు.

(జాగృతి- ఉగాది ప్రత్యేక సంచిక 1991)